# ఇంటిదీపం

సుబ్బారావు సీతాపతి బాల్యస్నేహితులు. సీతాపతి రైల్వేలో పనిచేస్తున్నాడు. వాళ్ళిద్దరు కలుసుకొని పదేళ్ళయింది. ఒకసారి వీలు చూసుకొని సుబ్బారావు సీతాపతిని చూసివద్దామని బయల్దేరాడు.

సుబ్బారావు రెండురోజులపాటు రైలుప్రయాణం చేశాడు. పదేళ్ళతర్వాత కలుసుకోబోతున్న సీతాపతిని గురించి ఆలోచిస్తున్న సుబ్బారావు చుట్టూ చిన్నా పెద్దా నల్లులు కమ్ముకొని ఘాటుగా పలకరించాయి. అతగాడి బెడ్డింగ్‌ని ఆలింగనం చేసుకొని సందుసందునా చోట్లుచేసుకొని ముచ్చట్లు వేశాయి.

సీతాపతి పరిస్థితి అధ్వాన్నంగా ఉందని విని సుబ్బారావు విచారించాడు. సీతాపతిని అంతా 'నిద్రమత్తుగాడ'ని పిలుస్తారట. ప్రమోషన్లు రాకపోగా చీవాట్లు పుష్కలంగా దొరికాయట. ఈ నిద్రమొహానికి రైల్వేలో ఉద్యోగం పొరపాటున ఇచ్చామని మొహాన్నే అనేశారట. సుబ్బారావు యథోచితంగా ఓదార్చి చిన్నప్పటి పెరుగన్నం కబుర్లు చెప్పి మనోపశమనం కల్గించాడు. సుబ్బారావు అక్కడున్న వారంరోజుల్లో అతని బెడ్డింగ్‌లోని నల్లులు సీతాపతి ఇంటినిండా వ్యాపించి అఖండంగా తమ సంతతి వృద్ధిచేసుకున్నాయి.

సంవత్సరం తిరిగేప్పటికి సీతాపతికి ప్రమోషన్ వచ్చింది. హఠాత్తుగా అతని నిద్ర పారిపోయింది. రాత్రి రెండుగంటల డ్యూటీ అంటే పన్నెండింటికే స్టేషన్‌లో ఉండేవాడు. నాలుగ్గంటలకి డ్యూటీ అయిపోయినా తెల్లవారేదాకా స్టేషన్ వదిలేవాడు కాడు. అతగాడు కాగడలా రాత్రిళ్లు పనిచేయటంమూలాన రెండుమూడు యాక్సిడెంట్స్ తప్పిపోయాయి. అందుగ్గాను సీతాపతికి డిపార్ట్‌మెంట్‌నించి ప్రశంసాపత్రం వచ్చింది. ఎవరైనా 'నీ విజయకేతనంమీద నల్లిబొమ్మ వేయాలోయ్' అంటే వెర్రిమొహం పెట్టాడు సీతాపతి.

కొందరు ఇంటిదీపం వెలుగుని అనుభవిస్తూకూడా గుర్తించలేరు.

---

సత్యం శంకరమంచి